

26న గురుకులాలకు టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

ఈ విద్యా సంవత్సరానికి గానూ గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలలు, మినీ గురుకులాలకు చికెన్, అరటిపండ్లు సరఫరా చేయడానికి ఈనెల 26న ఐటిడిఎలో టెండర్ నిర్వహిస్తున్నట్లు పిఒ కల్పనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు రూ.500 చెల్లించి ఈనెల 20 నుంచి 25వరకు టెండర్ రిసిప్ట్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. ఈనెల 26న మధ్యాహ్నం 3గంటలకు టెండర్ బాక్స్ తెరవబడుతుందని తెలిపారు.

విద్యుత్తు సంస్కరణలతో

ఉద్యోగ, ఉపాధికి గండి

- రైతుల రాయితీకి ఎసరు
- ప్రతిఘటనకు ప్రజలంతా ఐక్యం కావాలి
- సదస్సులో సిపిఎం, సిఐటియు నేతల పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విద్యుత్తు సంస్కరణలతో కేవలం వినియోగదారులకే కాకుండా సగటు మనిషికి నష్టం వాటిల్లుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పంపుసెట్లకు వర్తింపజేస్తున్న రాయితీలను కూడా ఎత్తివేసే ప్రమాదం ఉందని అన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ఇప్పటికే విశాఖలోని ఎన్‌టిపిసి తదితర విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ప్రైవేటీపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసిందన్నారు. ఈనేపథ్యంలో ప్రజలంతా సంఘటితమై విద్యుత్ రంగం సంస్కరణలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన 'విద్యుత్ సంస్కరణలు - ప్రజలపై భారాలు' అనే అంశంపై కెఎల్‌పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర సదస్సులో వీరు ప్రసంగించారు.

సదస్సులో తొలుత తులసీదాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, విశాఖ రైల్వే జోన్ సహా రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన అనేక హామీలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. తాజాగా స్టీల్‌ప్లాంట్ సహా పోర్టులు, ఎయిర్‌పోర్టులు ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. ఇది చాలదన్నట్టు ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట అదనంగా భారాలు మోపుతోందన్నారు. సోలార్, పవన్ విద్యుత్‌తో రూ.1కే యూనిట్ విద్యుత్ సరఫరా చేయవచ్చని, భవిష్యత్తులో తమ పార్టీ ఆధ్వర్యాన ఈ విధమైన ప్రయోగం చేసి చూపిస్తామని సవాలు చేశారు. విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల గృహ వినియోగదారులతోపాటు వ్యాపారులు, పరిశ్రమల మనుగడ కష్టతరంగా మారుతోందన్నారు. ఫలితంగా ఉన్న ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కరణల్లో భాగంగా స్మార్ట్‌మీటర్లు, ప్రీపెయిడ్ విధానం అమలు చేస్తే విద్యుత్ రంగంలో ఇప్పటికే పనిచేస్తున్న మీటర్ రీడింగ్ తదితర ఉద్యోగులు తొలగింపునకు గురయ్యే ప్రమాదం ఉంటుందని, కొత్తగా ఆ రంగంలో ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశాలు లేవని అన్నారు. ఇప్పటికే అవలంభించిన విధానం ఉత్పత్తి సంస్థల్లో వల్ల పెట్టుబడిదారుల హవా పెరిగిందని, ఇప్పుడు ట్రాన్స్‌మిషన్, పంపిణీ విభాగాల్లో కూడా అడుగు పెట్టేందుకు ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని వివరించారు. మోసపూరితమైన ఈ విద్యుత్ సంస్కరణలపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన వైఖరి బిజెపికి అనుకూలంగానే ఉందన్నారు. ఇలాంటి మోసకారి విధానాల వల్ల ఇప్పటి వరకు వామపక్ష పార్టీలు, ముఖ్యంగా సిపిఎం మాత్రమే పోరాడాయని, తాజాగా ముందుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలపైనా రాజీలేని పోరాటం చేస్తామని, ఆ తరువాత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కర్నూలు జిల్లా ఆధోని, శ్రీకాకుళం జిల్లా మందస, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి మూడు బస్సు యాత్రలు ఈనెల 30, వచ్చేనెల 2న ప్రారంభమై నవంబర్ 15నాటికి విజయవాడ చేరుతాయని అన్నారు. ఆరోజు జరగబోయే బహిరంగ సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు హాజరు కానున్నారని వివరించారు. ఆ బహిరంగ సభకు జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ భారాల వల్ల జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు చాలా వరకు మూతపడ్డాయని, ఫలితంగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయారని అన్నారు. ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో పరిశ్రమలకు యూనిట్ రూ.3కు సరఫరా చేస్తున్నారని, మన రాష్ట్రంలో మాత్రం రూ.8.50వసూలు చేస్తున్నారని తెలిపారు. రూ.7,300 కోట్ల అప్పుకు కక్కుర్తిపడ్డ సిఎం జగన్మోహన్‌రెడ్డి మోడీ మోసపూరిత విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణల బిల్లును పార్లమెంట్‌లో పెట్టేందుకు సాహశించని మోడీ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో కూడా నెగ్గే పరిస్థితి లేదన్నారు. అందుకనుగుణంగా పోరాడేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మోడీ చెప్పిందల్లా చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు.

సభాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాతూ విద్యుత్ భారాలు మోపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చంద్రబాబు మాదిరిగా గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందని, అందుకనుగుణంగా ప్రజల్ని చైతన్యపరుస్తామని అన్నారు. విద్యుత్ సంస్కరణలపై సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా రాజీలేని పోరాటం చేసేందుకు సదస్సు ఏకగ్రీవంగా తీర్మాణించింది. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, టివి రమణ, పి.శంకరావు, రెడ్డి శంకర్రావు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన జనం

రక్తహీనతపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్‌కు సిఎస్ అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రక్తహీనత, పోషకాహార లోపం నివారణకు, ప్రభుత్వ పథకాల అమలుకు పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టరు నిశాంత్ కుమార్ తీసుకుంటున్న చర్యలు, ప్రణాళిక అభినందనీయమని, మారుమూల గిరిజన ప్రాంతాలకు ఉపాధి హామీ పనులు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య, ఆరోగ్య, విద్యా, శిశుసంక్షేమ శాఖలు, ఇతర అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను వివరిస్తూ రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, బాలికలు, బాలింతలు, శిశువుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను అధిగమించేందుకు వైద్య, విద్యా, మహిళా శిశుసంక్షేమ శాఖల సమన్వయం పటిష్టపరుస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటినీ సర్వే చేసి రక్తహీనత, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తిస్తున్నారని, వారికి మందులు, పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైరిస్కు గర్భిణుల కేసులను మెడికల్ అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నరని తెలిపారు. వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. నాడు-నేడు పనుల ద్వారా పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పించడం జరిగిందని, టెన్త్ ఫలితాల్లో రాష్టంలోనే ఉత్తమ ఉత్తీర్ణతా శాతం సాధించినట్లు తెలిపారు. టీకా, ఫ్యామిలీ డాక్టరు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, జగనన్న సురక్ష శిబిరాలు వివరాలను ముందుగా ప్రజలకు తెలియపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకంరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ నాయకుల నిరవధిక దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

ఒపిఎస్ సాధనకు

యుటిఎఫ్ నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ సాధన కొరకు ప్రాణాలైనా అర్పిస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో ముందుకెళ్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఐదేళ్లు అవుతున్నా రద్దు చేయకుండా జిపిఎస్ పేరుతో ఉద్యోగులను నమ్మించి మోసం చేశారన్నారు. జిపిఎస్ మా కొద్దని, ఒపిఎస్ అమలు చేయాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. . దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇవ్వకుండానే సిపిఎస్ ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. లక్షల మంది ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నా ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నిరాహార దీక్షలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు, రాష్ట్ర కౌన్సిలర్, సిపిఎస్ కౌన్సిలర్ ఎం.శంకర రావు, కో-కన్వీనర్ పి.సుధా జిల్లా సహాధ్యక్షులు బి.విజయ్‌కుమార్ కూర్చున్నారు. దీక్షలకు జెఎసి నాయకులు జివిఆర్ కిషోర్, జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం నాయకులు పిసిహెచ్ శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ కూర్మినాయుడు, సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, టిడిపి నాయకులు బోనెల విజయచంద్ర, ఎస్ఎపి నాయకులు గోవిందు, పిఇటిల సంఘం నాయకులు మురళి, విఆర్‌ఒలు, పెన్షనర్ల సంఘాల నాయకులు సింహాచలం, జగన్నాథం, మనోభాయి, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మద్దతు తెలిపారు.

9522 మందికి 'జగనన్న చేదోడు'

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో 9522 మంది లబ్దిదారులకు జగనన్న చేదోడు నాలుగో విడత నిధులు రూ.9.522 కోట్లు పంపిణీ చేసినట్లు జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో జరిగిన జగనన్న చోదోడు జిల్లా స్థాయి నిధులు పంపిణీ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు పాల్గొని లబ్దిదారులకు చెక్కును అందజేసి నిధులు విడుదల చేశారు. అనంతరం జెసి మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి, షాపులున్న రజకులు, షాపులున్న నాయీబ్రాహ్మణులు, టైలరింగ్ చేస్తూ షాపులున్న అన్ని కులాల వారికి ఏడాది రూ.10వేలు చొప్పున అందజేశామన్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో నాలుగో విడత 2969 రజకులకు రూ.2.969కోట్లు, 1090 నాయీ బ్రాహ్మణులకు రూ.1.090 కోట్లు, 5463 టైలరింగు వృత్తిదారులకు రూ.5.463 కోట్లు చొప్పున 9522 మంది లబ్దిదారులకు 9.522 కోట్ల రూపాయలు నిధులు పంపిణీ చేశామని తెలిపారు. టిడ్కో చైర్మన్ జె.ప్రసన్నకుమార్ మాట్లాడూతూ ప్రభుత్వం పేదలను ఆదుకొనేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, అందులో వెనుకబడిన కులాల అభివృద్ధికి, వారికి ఆర్థిక ఉన్నతికి అధికప్రాధాన్యమిస్తూ చేదోడుగా నిధులు పంపిణీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషను చైర్మన్ ఆర్.రమాదేవి, పలు సామాజికవర్గాల డైరెక్టర్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, లబ్దిదారులు పాల్గొన్నారు.




లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న జెసి గోవిందరావు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పౌష్టికాహార స్టాల్స్ సందర్శన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ఉద్దవోలులో గురువారం అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాళ్లను ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాల్‌లో ప్రదర్శించిన సెనగచక్కీలు, బెల్లం అరిసెలు, బాలామృతంతో చేసిన లడ్డూలు, నువ్వుండలు, కూరగాయలు, ఆకు కూరలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సమూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, బొంగు గౌరమ్మ, దళాయివలస సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ, హెచ్‌వి చింతాడ ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

ప్రభుత్వ భూములు గిరిజనులకు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం అలమండ, మరువాడ రెవెన్యూలో పెద్ద ఎత్తున ప్రభుత్వ, బంజరు భూములు ఉన్నాయని వీటిని గిరిజనులకు, దళితులకు పంచాలని ఆదివాసి గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ అలమండ, మరువాడ రెవెన్యూలో తొమ్మిది గిరిజన గ్రామాలు ఉన్నాయని ఈ గ్రామాల్లో గిరిజనలు, దళితులు, పేదలు అనేకమంది భూములు లేకుండా ఉన్నారని అన్నారు. అలమండ, మరువాడ రెవెన్యూ పరిధిలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది స్థానికేతర్లు, పక్క పంచాయతీలో ఉన్న పెత్తందారులు ఒక్కొక్కరు 10 నుండి 15 ఎకరాల భూమి వరకు ఆక్రమించి అన్యాక్రాంతంగా ప్రభుత్వ బంజర భూములు దున్నుకుంటున్నారని వీటిని రీ సర్వే జరుగుతున్న సందర్భంలో సర్వేయర్లు పెత్తందారుల సాగులో ఉంటే వారికి రెగ్యులర్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ బంజరు భూములలో ఉన్న పెత్తందారులకు హక్కులు, అర్హత లేని వారి దగ్గర నుంచి భూమి తీసుకుని గిరిజనులకు, దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో గిరిజనులు, దళితులు, పేదలే ఆ భూముల్లో సాగుకు సిద్ధపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి గోరపాడు సోమయ్య, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కోరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భూతాల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



సదస్సులో మాట్లాడుతున్న సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం అభివద్ధి పథంలోకి దూసుకు వెళ్తుందని సి.రాఘవచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. సిఆర్ ఎపి మీడియా అకాడమీ, ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ - పాలన సంస్కరణలు - మెరుగైన పౌర సేవలపై సదస్సు గురువారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్యఅతిధిగా పాల్గొనగా, ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ప్రతి 50 గృహాలకు వాలంటీర్లను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటికే ప్రభుత్వాన్ని తీసుకొచ్చిందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందించి విమర్శలకు తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న సంగతిని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో 10 మంది వైద్యులు, 105 రకాల మందులను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. విశాఖలో రూ.15వేల కోట్లతో ఇన్ఫోసిస్, ఫార్మా కంపెనీలు ఏర్పాటు, రామాయపట్నం వద్ద రూ.45వేల కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ వంటివి రాబోతున్నాయని, దీంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనుందని అన్నారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పేద, బడుగు, అట్టడుగు, బలహీన వర్గాలతో పాటు అందరికీ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదని చెప్పారు. ఆర్టికల్ 13,17లను నిజం చేసి నెహ్రూ ఆలోచనలు, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి దాదాపు కోటి రూపాయల సంపదను ఇచ్చి ప్రజల అవసరాలను తీరుస్తున్నారని చెప్పారు. 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఆంగ్ల భాషలో విద్య, నాడు-నేడు పేరుతో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు, వచ్చే జనవరి నుంచి రూ.3వేల పింఛను వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం చుక్కవానివలస, నిమ్మవలస, పొట్టిగడపవలస గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని సేవలు అందిస్తున్న జి.గోపాలరావు, గణేష్, ఉమాలకు దుస్సాలువతో సత్కరించారు. తొలుత జిల్లాకు విచ్చేసిన చైర్మన్‌కు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్ ఘన స్వాగతం పలికారు. ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ పి.కె.ప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన అధికారి గిరిజ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ గున్నేష్, ఎంపిపి శోభారాణి, ఎంఇఒ ఎస్.సింహాచలం, ఉపాధ్యాయులు తిరుపతిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

ప్రజాశక్తి -కొమరాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చినఖేర్జెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రక్షణ భేరి పేరిటతో నిర్వహిస్తున్న బస్సు యాత్రకు సంబంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆ బస్సుయాత్ర జిల్లాకు ఈనెల 30,31 తేదీల్లో రానున్న సందర్భంగా ప్రజా రక్షణ భేరికి సంబంధించిన కరపత్రాలు వివిధ గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు సహాయపడే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు కూడా రోజురోజుకు పెంచే తరుణంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు, వ్యవసాయ కూలీలు రైతులు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని తెలిపారు. కావున విద్యుత్ ఛార్జీలు కూడా తగ్గించాలని, పోలవరానికి నిధులు ప్రకటించాలని, అలాగే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, తదితర సమస్యలపై బస్సు యాత్ర జరుపుతున్నట్టు తెలిపారు. కావున ప్రజలంతా బస్సుయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం జరిగిన ప్రజా రక్షణ బస్సు యాత్ర పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమై నవంబర్ 15న విజయవాడలో గొప్ప బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని సిపిఎం నాయకులు సూకురు అప్పలస్వామి పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం జరిగిన బస్సు రక్షణ యాత్ర జయప్రదానికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా ముందుకు రావాలన్నారు. ఇప్పటికే సిపిఎం ప్రత్యేక హెూదా, విభజన హామీ అమలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దని అనేక సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని, గిరిజన చట్టాలను కాపాడాలని, జిఒ3ను కొనసాగిస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, భవిష్యత్‌లో సిపిఎం చేస్తున్న పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు కొర్ర కళ్యాణ్, అర్జున్, ఎస్.రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్



ఎపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

రాష్ట్ర వ్యాప్తంగా విఒఎలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సాలూరు మండల విఒఎలు గురువారం ఎపిఎం సింహాచలంనకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల విఒఎల సంఘం నాయకులు మాట్లాడుతూ విఒఎలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేయించాలని, కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. మేజ్జింగ్ విధానం రద్దు చేయాలని, పని భారం పెరుగు తున్నందున ప్రభుత్వమే మొబైల్ అందజేయాలని. ప్రతి విఒఎకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని వెలుగు ఉద్యోగులపై పని ఒత్తిడి లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విఒఎ ఉద్యోగులు సంఘం ప్రతినిధులు రేణుక, మంగమ్మ, ఉషారాణి, హేమ, లావణ్య, బాలరాజు, నాగరాజు, సుందరరావు, నూకయ్య, గోపాల్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయానికి డాగ్ 'మ్యాక్స్'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర పోలీసు శాఖ ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఆధర్యంలో మంగళగిరి సిటిసి శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల శిక్షణ అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించిన నార్కోటిక్స్ ట్రాకింగ్ డాగ్ 'మ్యాక్స్' గురువారం జిల్లా ఎస్‌పి కార్యాలయానికి చేరుకుంది. డాగ్ సంరక్షకులు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మ్యాక్స్‌కి స్వాగతం పలికి తొమ్మిది నెలల శిక్షణ తీరును, 'మాక్స్' ఆరోగ్యం, శిక్షణ నైపుణ్యాను అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో జిల్లాకు చెందిన డాగ్ హ్యాండ్లర్ కె.రామారావు స్పేర్ హ్యాండ్లర్ వి.బలరాంలను డాగ్ 'మాక్స్' ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రమానుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, రిజర్వు సిఐ కుమార్ పాల్గొన్నారు.



ఎస్‌పి కార్యాలయాన్ని చేరుకున్న డాగ్ మ్యాక్స్


ఏనుగులు ధ్వంసం చేసిన అరటిపంటను చూపుతున్న బాధిత రైతు అద్దాయి

గిరిశిఖర గ్రామాల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గిరిశిఖర గ్రామమైన తిత్తిరిలో గురువారం సాయంత్రం ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తూ సమీప అరటితోటల్లో తిరుగుతూ హిమరక అద్దాయి అరటి పంటలను నాశనం చేశాయి. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజన ప్రజలు మాట్లాడుతూ ఇంతవరకు ప్రశాంతంగా ఉంటూ పంటలను సాగు చేసుకుంటున్న సమయంలో ఏనుగులు మా గ్రామాల మధ్య సంచరిస్తుండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందని భయభ్రాంతులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి మా ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును దూర ప్రాంతాలకు తరలించి తమ పంటలను, తమ ప్రాణాలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో గల కోటదుర్గమ్మను దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విజయనగరం జిల్లా స్పెషల్ కోర్టు అదనపు జడ్జి కె.నాగమణి, శ్రీకాకుళం జిల్లా ఏపి ఎన్జీవో సంఘం అధ్యక్షులు హనుమంతు సాయిరాం దంపతులు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మకానికి ధాన్యం సిద్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.వి.పురం, నీలానగరం, పనస నందివాడ, తెట్టంగి గ్రామాల్లో అమ్మకానికి ధాన్యం సిద్ధంగా ఉన్నట్లు అన్నదాతలు తెలిపారు. 1156 రకం తేలిక పాటి వంగడాలు వేయడం వల్ల అప్పుడప్పుడు కురిసిన వర్షాల కారణంగా పంట త్వరగా చేతికి వచ్చినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

వజ్ర భారతి, గేయహారతి పుస్తకాలు విడుదల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ, ఎల్విన్‌పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవులు పాలక దేవానంద్, పెద్దింటి నిర్మల్ కుమార్ రచించిన వజ్రభారతి, గేయహారతి పుస్తకాలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా ఒకవైపు తమ విధులను నిర్వహిస్తూ, ఖాళీ సమయాల్లో విద్యార్థులలో స్ఫూర్తినింపే పాటలు కవితలు, రచనలు రాసి పుస్తకాల్లో ప్రచురణ కావడం, గుర్తింపు పొందడం సంతోషంగా ఉందన్నారు. నేటి తరం యువతకు ఆదర్శంగా, రేపటి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచేలా మరిన్ని రచనలు చేయాలని కోరారు.

ఏడాదికే మరమ్మతుకు గురైన రోడ్డు

ప్రజాశక్తి - వీరఘట్టం

దీర్ఘకాలం పాటు ఉండాల్సిన రోడ్డు నిర్మించిన అనతికాలంలోనే పాడైపోయిన దుస్థితి మండలంలోని చోటు చేసుకుంది. మండలంలోని చిట్టిపుడివలస నుంచి వండువ గ్రామం వరకు గత ఏడాది ప్రధాని 18వ సుమారు రూ.రెండు కోట్లు అంచనా వ్యయంతో 10 కిలోమీటర్ల పరిధిలో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. గుత్తేదారులు ఇచ్చిన కానుకలకు అధికారులు కక్కుర్తి పడి పనులు జరిగిన సమయంలో పర్యవేక్షించలేదు. దీంతో గుత్తేదారు ఇష్టానుసారంగా నాసిరకంగా పనులు చేపట్టి బిల్లులు చెల్లించుకున్నారు. దీంతో అతితక్కువ కాలంలోనే రోడ్డు మరమ్మతులకు గురైంది. ప్రస్తుతం భారీవాహనా రాకపోకలు వల్ల సిఎఎస్ రహదారిపై ఎక్కడికక్కడే పెచ్చులూడి దర్శనమిస్తుంది. ఈ కారణంగా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకొని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌కు చెందిన ఇసాయి త్రినాథ్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు సర్పంచ్ ఐ.గౌరీశంకర్, ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి గురువారం గ్రామ సచివాలయం వద్ద వైయస్సార్ బీమా తక్షణ సహాయం 10వేలు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ బి.ఆనంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులపై దాడులు, అత్యాచారాలు నిలిపివేయాలని కోరుతూ గురువారం విజయవాడలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఎస్‌సి, ఎస్‌టి ఫెడరేషన్ ఉపాధ్యాయుల సంఘం వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర జనరల్ కార్యదర్శి పోతల దుర్గారావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగు పోస్టులు రిక్రూట్మెంట్ ద్వారా నియమకాలు చేపట్టాలన్నారు. జిఒ ఎంఎస్ నెంబర్ 117లో ఎన్ఇపి ద్వారా మూడు, నాలుగు, ఐదు తరగతులు మిర్జింగు ఆయా పాఠశాల ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉపాధ్యాయులకు నష్టం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.వెంకటరావు, ఏ. సూర్యనారాయణ, జి. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలి

ప్రజాశక్తి- సీతంపేట

సవర భాష విద్యా వాలంటీర్లు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధించాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.మంగవేణి అన్నారు. గురువారం సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిపిఎస్ సవర భాష విద్యా వాలంటీర్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడారు. ఒకటి నుంచి ఐదో తరగతి జిపిఎస్ విద్యార్థులకు పరిసరాల విజ్ఞానం టెక్స్ బుక్‌లోని పదాలను సవర భాషలో చెప్పి నేర్పించేందుకు భాషా వాలంటీర్లు తయారు చేసిన టీయల్ఎం మెటీరియల్ తయారు చేసి రిసోర్స్ పర్సన్స్ బోధించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి, ఏఎమ్ఓ పి కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యాన కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శి సిమ్మయ్య మాట్లాడుతూ యాజమాన్యం ఉద్యోగుల పట్ల అవలంభిస్తున్న చర్యలు దుర్మార్గంగా ఉన్నాయన్నారు. డిపో వర్కింగ్ అధ్యక్షులు డిజె బాబు మాట్లాడుతూ ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, దీనిపై అధికారులు పట్టించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్‌రావు, భుజంగరావు, ఎంఆర్ మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

మూతపడిన ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి - వీరఘట్టం


మూతపడిన ఆధార్ కేంద్రం ఇదే..

స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం మూతపడింది. ఐడి బ్లాక్ అవ్వటం వల్ల వీరఘట్టంతో పాటు దోనుబాయి, బామిని, పాలకొండ, కేంద్రాలలో కూడా గత నెల 18వ తేదీ నుండి మూత పడినట్లు నిర్వహకులు తెలిపారు. ఆధార్ కేంద్రం మూతపడడంతో అర్జీదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

ఎండిన వరి పంట పరిశీలన

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని కోట సీతారాంపురంలో వర్షాభావం వల్ల ఎండిపోయిన వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఆర్.శ్రీనివాస్, రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ శారద, శాస్త్రవేత్త సౌజన్య, ఎఒ అవినాష్ గురువారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నెలలో వర్షపాతం ఆశజానకంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటి వరకూ 124 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 36 మిల్లీమీటర్ల మాత్రమే నమోదైందన్నారు. దీంతో వర్షధారంగా పండిన వరి పంటలు కొన్ని మండలాల్లో నీటి ఏద్దడికు గురవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు కలిసి పంటలను పరిశీలించి రైతులకు నీటి ఎద్దడి నుంచి బయటపడే పరిస్కారం చూపించాలన్నారు. సీతానగరంలో 6 గ్రామాలలో వరి పంట ఎండిపోయిందన్నారు. ఇటువంటి పంటలను జిల్లా వ్యాప్తంగా గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదికిస్తామన్నారు. శాస్త్రవేత్త సౌజన్య మాట్లాడుతూ ఇలా వర్షం పడక, తేమ లేని వరి పంటలలో ఎకరాకు 2కేజీలు వరకు 19:19:19, 13:0:45, మల్టీకె వంటి రసాయనాలు పిచికారీ చేసుకోవాలని లీటర్ నీటికి 10 గ్రాముల కలుపుకొని 14 నుండి 16 ట్యాంక్‌లు పిచికారీ చేయాలన్నారు. అలా చేయడం వల్ల పది రోజులు వరకు తేమ ఉండి మొక్కలు వాడిపోకుండా కాపాడుకోవచ్చు నన్నారు. వ్యవసాయాధికారి అవినాష్ మాట్లాడుతూ పూర్తిగా వాడి పోయిన వరి పంట నివేదికపై అధికారులకు పంపిస్తామని ఇప్పటి వరకు నిడగళ్ళు కోట, సీతారాంపురం, వెన్నెల బ్బుంపేట, సూరంపేట, పెదభోగిలా, గాదెలవలసలో ఎద పంటలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


కురుపాం: పంటను పరిశీలిస్తున్న కెవికె సిబ్బంది

వర్షా భావాన్ని తట్టుకునేలా చర్యలు చేపట్టాలి

పాచిపెంట: మండలంలో గత 20 రోజులుగా వర్షాల్లేకపోవడం వల్ల మెట్టు పంటలు వర్షాభావ ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని, కావున రైతులు తగు చర్యలు చేపట్టడం ద్వారా పంటలను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస రైతు భరోసా కేంద్రం పరిధిలో గల పంటలను పరిశీలిస్తూ రైతులకు పలు సూచనలు జారీ చేశారు. వర్షాభావానికి గురయ్యే వరి పంటపై రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకోవడం ద్వారా పది రోజుల పాటు పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే ఎండ వేడిమికి దోమపోటు, పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని, ఆర్ జి ఎల్ 2537, సాంబమసూరి రకాలు వీటిని తట్టుకోలేవని, వీటి నివారణ చర్యలుగా ఇమెడా క్లోప్రేడ్, థయో మెథగ్జామ్, చెస్, అప్లాడ్ వంటి మందుల్లో ఒకదాన్ని సాఫ్ లేదా హెక్సా కొనజోల్ లేదా ప్రాఫీ కొనజోల్ మందులతో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే పత్తి పంటపై మల్టీకే ఐదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షా భావానికి రసం పీల్చు పురుగులు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉందని. వీటి నివారణకు ఎసిటమిప్రిడ్ లేదా తయో మెతాక్జోమ్ లలో ఒకదాన్ని 0.4 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

ఎండిన పైరుకు ద్రవ జీవామృతంతో ఉపశమనం

పార్వతీపురం రూరల్: మెట్టు ప్రాంతాలలో వర్షాధార భూములలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులకు తట్టుకునేందుకు ద్రవ జీవామృతంతో కొంతవరకు రక్షణ కల్పించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షణ్ముఖ రాజు అన్నారు. గురువారం ఈ విషయంపై రైతులతో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్టు ప్రాంతాల్లో నీరు లేని పంటలో జీవం కల్పించడానికి ఒక ట్యాంకు నీటిలో రెండు లీటర్ల ద్రవ జీవామృతం కలిపి, పిచికారీ చేయాలని, దీంతో పాటుగా సప్త ధాన్యాంకుర కషాయం ఒక ట్యాంకుకు లీటర్ చొప్పున, పేడా మూత్ర ఇంగువ ద్రావణం ఒక ట్యాంకుకు లీటర్ చొప్పున పంట పెరుగుదలకు పై ద్రావణాల్లో ఏదైనా ఒకటి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన కెవికె సిబ్బంది

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం పలు గిరిజన గ్రామాల్లో సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త టిఎస్ఎస్‌కె పాత్రో, సహాయ వ్యవసాయ సహాయకులు నిర్మల జ్యోతి వరి సాగు చేసే రైతులు మాట్లాడుతూ వరి కోత దశలో ఉన్నందున యూరియా 2 శాతం పిచికారి చేయాలని, పత్తి పిందె, కాయ దశలో ఉన్నందున యూరియా 1 శాతం పిచికారీ చేయాలని తెలిపారు. వీటితో పాటు సూక్ష్మ పోషకాలు ద్రావణం పిచికారీ చేయాలని, అలా అయితే పంటలు దిగుబడులు తగ్గకుండా ఉంటాయని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


సీతానగరం: ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

'చి'వరి' పోరాటం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపుడివలస గ్రామ సమీపంలో వరి పంటను కాపాడుకునేందుకు చివరిసారిగా అన్నదాత ఆరాటం పడుతున్నారు. పంట పొట్ట దశలో ఉన్నందున సాగునీటి సౌకర్యం లేకపోవడంతో వేరే రైతు సహాయంతో మోటార్ సదుపాయం ద్వారా పంటను కాపాడుకునేందుకు నీటిని మళ్లిస్తున్నారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఉందని చెప్పుకోవటమే తప్ప పిల్ల కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో పంటను సాగు చేసిన మొదలు కోతకు వచ్చేంతవరకు నీటి కోసం ఆరాట పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరి తడిపేందుకు మోటారు పెట్టిన రైతు

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం మండలంలోని నర్సిపురం-1లో జెఎఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందించి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని, అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం నాణ్యమైన ఆసుపత్రులకు రిఫరల్ సౌకర్యం కూడా ఉందని అన్నారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, వైద్యాధికారులు డాక్టర్ తిరుమల ప్రసాద్, సర్పంచ్ చెరుకుపల్లి బంగారమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణ, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాధరావు, బంకూరు రవికుమార్, నాయకులు వెంపల గురురాజు, కాపరపు సత్యనారాయణ, రామస్వామి, భూతాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: పేదలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. గురువారం రామాకాలనీ సచివాలయానికి సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ బీసపు హైమ సత్యవతి, కమిషనర్ టి.జయరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు, ఆర్ ఐ అహ్మద్ పాల్గొన్నారు.

సాలూరు రూరల్ పేదప్రజల ఆరోగ్య ప్రదాయిని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి అన్నారు. మండలంలోని పెదపదం సచివాలయం పరిధిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి మండల అధ్యక్షుడు భరత్ శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్పర్సన్ దండి అనంత కుమారి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, సర్పంచ్ రెడ్డి సుకన్య, వైద్యులు పాల్గొన్నారు.


సాలూరు రూరల్: జెఎఎస్ కిట్లను పంపిణీ చేస్తున్న రెడ్డి పద్మావతి తదతరులు

సీతానగరం : మండలంలోని గాదెలవలస గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాల ద్వారా గుర్తించిన రోగులను వైద్యం కోసం ఇతర కార్పొరేటు ఆసుపత్రికి పంపించి లైన్ చేయడం ప్రభుత్వ బాధ్యత వహిస్తుందన్నారు. ఇందులో అన్ని వ్యాధులకు తనిఖీలు చేయబడినన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొన్నాడ అన్నపూర్ణ, వైసిపి నాయకులు బొన్నాడ తిరుపతిరావు, శివకుమార్, ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, వైద్యులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కువ : మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మావూడి రంగునాయుడు వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన సేవలను పరిశీలించి రోగులకు, వైద్య సిబ్బంది చికిత్స చేసే పని తీరును అడిగి తెలుసుకున్నారు. అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండండి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోండి అని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు హరికృష్ణ, కిరణ్ కుమార్ రెడ్డి ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

భామిని :మండలంలోని బత్తిలిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచి టింగ శాంతి కుమారి ప్రారంభించారు. బత్తిలి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కొండపల్లి రవీంద్ర, డాక్టర్ దామోదరరావు, డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 543 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెల్త్, న్యూట్రిషన్, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బత్తిలి ఎంపిటిసి సభ్యులు టింగ అన్నాజీరావు, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, ఎంపిడిఒ జి.చంద్రరావు, డిప్యూటీ తహశీల్దార్ శేఖరం, ఎంఇఒ భాస్కరరావు, పంచాయతీ సెక్రటరీ శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలో చినఖేర్జలలో జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు తనిఖీ చేశారు. ఎంత మందికి వైద్య సేవలు అందజేశారు, సర్వేలో ఇచ్చిన టోకెన్లు, ప్రతి కౌంటర్ వద్ద ప్రజలకు అందజేసిన వైద్య సేవల వివరాలు, ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఎక్కువగా వచ్చారు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఒపి నమోదు వివరాలు పరిశీలించారు. పోషకాహార లోపం, హై రిస్క్ ఉన్నవారిని గుర్తించారు అడిగి రికార్డులో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. మల్లికార్జునరావు, వైద్యాధికారి సిహెచ్.అరుణ్ కుమార్, సర్పంచ్ హెచ్.గంగారావు, వైస్ సర్పంచ్ పి.ప్రసాద్, స్పెషలిస్ట్ వైద్యులు, పంచాయతీ సెక్రటరీ టి.వెంకటరమణ, సూపర్ వైజర్లు విజయకుమారి, జయగౌడ్ వైద్య, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని వండవలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే వి.కళావతి పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఆమె అన్నారు. ఈ సందర్భంగా 430 మంది రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంతకుముందు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలోఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, సర్పంచ్ ఎం కళ్యాణి, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంఇఒ ఆనందరావు, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎస్.నితీష్, ఎం.గోవిందరావు, వైద్య, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపే

ప్రజాశక్తి- సాలూరు

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయడం వైసిపి ప్రభుత్వ కక్షసాధింపు చర్యేనని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి అన్నారు. గురువారం బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఆమె పట్టణంలోని 25వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు అరెస్టు పై ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. జాతీయ స్థాయిలో పేరున్న గొప్ప నాయకుడిని జైల్లో పెట్టడం అనైతికమన్నారు. టిడిపికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే జగన్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని సంధ్యారాణి కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, నల్ల అర్జున్ రావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం పెదమేరంగిలో గురువారం సాయంత్రం చంద్రబాబు అరెస్ట్ పై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. మాజీ మంత్రి శత్రుశర్ల విజయ రామరాజు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, నాయకులు మూడడ్ల సత్యం నాయుడు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, లంక గోపాలం, రెడ్డి బలరాం స్వామి నాయుడు, జోగి బుజింగ రావు, కర్రి రాజేంద్ర నాయుడు, శివ్వల నరిసింగరావు, సుదర్శన్ రావు, యల్ మోహనరావు, గుంట్రెడ్డి సత్యంనాయుడు పాల్గొన్నారు.


సాలూరు: మహిళతో మాట్లాడుతున్న సంధ్యారాణి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి జివి కృష్ణారావు తెలిపారు. కోటదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా గురువారం దగ్గరుండి ఆయనే బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాల రద్దీపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నుంచి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్ఐ శివ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథ రావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, పిటిలు పుష్పనాథం, రాజేంద్ర తదితరులున్నారు.

సీతంపేట ముందంజ

ప్రజాశక్తి - సీతంపేట

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ చేసి లాగిన్‌లో చేయడంలో జిల్లాలో సీతంపేట మండలం ముందంజలో ఉందని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. జిల్లాలో 100936 లాగిన్ అయితే అందులో సీతంపేట 8336 ఆరోగ్యశ్రీలో లాగిన్ అయ్యారని తెలిపారు. ఇప్పటికే 14893 ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని, లాగిన్ చేసుకోని వారు వాలంటీర్ సాయంతో వెరిఫై చేసుకుని లాగిన్ అవ్వాలని కోరారు.

హెర్నియాకు చికిత్స

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో గురువారం సూపరింటెండెంట్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన టి ఉషాకి బొడ్డు హెర్నియా శస్త్ర చికిత్సను తొలిసారి చేశారు. జనరల్ సర్జన్ డివి శ్రీనివాస్, మత్తు డాక్టర్ రత్నాకర్ నేతృత్వంలో నిర్వహించి ఈ చికిత్స విజయవంతమైంది.

చందలంగిని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదమరికి పంచాయతీ చందలంగి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం వైసిపి సానుభూతి పరులు ఊయక లక్ష్మి భర్త నరసన్న ఇటీవల ప్రమాదశాత్తూ చనిపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి జరిగిన సంఘటనకు తీవ్ర దిగ్భ్రాంతికి వ్యక్తం చేశారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి కుటుంబానికి కొంత మొత్తంలో ఆర్థిక సహాయం చేసి పిల్లలను బాగా చదించించాలని, మీకు అన్ని విధాలా అండగా నిలవడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు పట్టుచీరలను అందిస్తున్న కోటేశ్వరరావు


ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రావాడ కోటి జంక్షన్ వద్ద వెలిసిన కోట దుర్గమ్మ తల్లి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం దుర్గమ్మ శ్రీమహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కురుపాంతోపాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంధవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 11 గంటల వరకు అమ్మవారికి రోజుకు ఒక అలంకరణ రూపంలో తీర్చిదిద్ది మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పూజల్లో పాల్గొన్న మహిళల కోసం ప్రత్యేకంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గుర్ని ఎంపిక చేసి పట్టు చీరలను బహుమతులుగా అందజేయడం జరుగుతుందన్నారు. శుక్రవారం మూలా నక్షత్ర సందర్భంగా దుర్గమ్మ సరస్వతి దేవి అలంకారంలో ఉంటుందని కావున ప్రత్యేకంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

రాత్రిపూట తాగునీటి సరఫరా

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్


రాత్రిపూట నీటిని పట్టుకుంటున్న మహిళలు

జిల్లా కేంద్రంలో మున్సిపల్ పరిధిలో గల పలు వార్డుల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా జరుగుతున్నప్పటికీ, సంబంధిత సిబ్బంది సమయపాలన పాటించకుండా వేళాపాళాలేని తాగునీరు సరఫరా చేస్తుండడంతో స్థానిక మహిళలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న నాగావళి నదీ పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ తాగునీటికి ఈ పరిస్థితి ఏమిటని మున్సిపల్ తాగునీటి విభాగం అధికారులు, సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో 26వ వార్డులో బుధవారం రాత్రి 6.30 గంటలకు తాగు నీరు సరఫరా కావడంతో నీళ్ల పట్టుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వేళాపాళాలేకుండా సరఫరా ఏమిటని మునిసిపల్ అధికారులు, సిబ్బంది పై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. తాగునీటి సరఫరాపై సంబంధిత మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

భారీగా నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్


పట్టుబడిన నాటుసారాతో పోలీసులు

ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎల్ ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం ఒడిషా రాష్ట్రం అలమండ నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారంతో పార్వతీపురం మండలం రంగాలగూడ గ్రామ సమీపంలో మాటు వేసి 880 లీటర్ల నాటుసారాతో పాటు ఇన్నోవ కారును సీజ్ చేశారు. కొమరాడ మండలం పూడేసు గ్రామానికి చెందిన ఆరిక నరేష్ అలియాస్ వరుణ్, పార్వతీపురానికి చెందిన సిరిపురపు నారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ ఉపేంద్ర మాట్లాడుతూ పట్టుబడిన ఇద్దరినీ విచారించగా ఒడిషా రాష్ట్రం అలమండ గ్రామానికి చెందిన బెవరా శరత్ నాటు సారా సరఫరాదారుడుగా అంగీకరించడంతో ఆయనపై కూడా కేసు నమోదు చేశామన్నారు. సదరు ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ వి.వి.రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కుక్కిడి మలుపు వద్ద ఎగువ తాడికొండకు చెందిన సాగర్ బైక్ పై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గుర్తించిన డుమ్మంగి గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ పాండు స్పందించి భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీరలించి వైద్యం అందించారు. సకాలంలో వైద్య సేవలు అందించడం ప్రాణాపాయం తప్పింది. పాండు సేవా దృక్పధాన్ని గుర్తించి పలువురు అభినందిస్తున్నారు.